
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
శనివారం 10 ఫిబ్రవరి 2024



## విశ్వకర్మలు ఐక్యంగా ఉండాలి

పరిగి, ఫిబ్రవరి 9: విశ్వకర్మలు ఐక్యంగా ఉండాలని విశ్వకర్మ సంఘంజిల్లా అధ్యక్షుడు వండ్ల పాండురంగాచారి, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు చెన్నయ్యచారిఅన్నారు. శుక్రవారం పరిగిలో విశ్వకర్మ సంఘం క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశ్వకర్మ కులస్తులంతా ఒకతాటిపైకి వచ్చిన పోరాడితే ఏదైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు జగదీశ్వరచారి, రవిచారి, రమేశ్‌చారి, బ్రహ్మచారి, నవీన్‌చారి, రఘుచారి, రాజేశ్‌చారి, వినోద్‌చారి తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాలో అప్పుడే ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. భానుడు భగ్గుమంటున్నాడు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వారం క్రితం చల్లగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. ఉదయం 8 గంటలు దాటితే వేడికి తట్టుకోలేకపోతున్నారు. మధ్యాహ్నం వేళలో భానుడు మరింత తీవ్రంగా విజృంభిస్తున్నాడు. రాత్రివేళ ఉక్కపోత కూడా పెరిగింది. దీంతో జనం అప్పుడే కూలర్లు, ఏసీల వాడకం మొదలు పెట్టారు.

# తగ్గిన చలి... పెరిగిన ఎండ!

- మధ్యాహ్నం మరింత తీవ్రం
- రాత్రివేళ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- అప్పుడే కూలర్లు.. ఏసీల వాడకం

## ఫిబ్రవరిలోనే ఉష్ణోగ్రతల తాకిడి

వికారాబాద్/మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఫిబ్రవరి 9): చలికాలంలోనే ఎండలు చిటపట మంటున్నాయి. ఫిబ్రవరిలో మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. ఉన్నట్టుండి వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగి పోతున్నాయి. దీంతో గతేడాది మార్చి నెల ఆరంభంలోనే ఎండలు మండి పోతేనే అబ్బో అన్న ప్రజలకు.. ఈ సారి ఫిబ్రవరిలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గత ఏడాది ఇదే సమయంలో పోల్చితే ఎండలు ఈసారి తీవ్ర స్థాయికి చేరిపోతున్నాయి. ఉమ్మడి జల్లా వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి. సాధరణం కంటే 2 నుంచి 4 డిగ్రీల మేర అధికంగా ఉష్ణోగ్రతలు నమోదువుతున్నట్లు వాతావరణ శాఖ స్పష్టం చేస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే.. మార్చి, ఏప్రిల్, మేలో ఎలా ఉంటాయోనని జనం జంకుతున్నారు.

### పెరిగిన ఉష్ణోగ్రతలు

ఉమ్మడి జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగి పోయాయి. గురువారం వికారాబాద్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. గత ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన 33.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత ఏడాది నమోదైన ఉష్ణోగ్రతను పరిశీలిస్తే ఈ సారి 5 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది. రంగారెడ్డి జిల్లాలో గత ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన 33.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈసారి 38.5 డిగ్రీల ఉష్ణోగత్ర నమోదైంది. గత ఏడాది నమోదైన ఉష్ణోగ్రతను పరిశీలిస్తే.. ఈ సారి 4.6 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది. మేడ్చల్ జిల్లాలో గత ఏడాది 35.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈసారి 38.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత ఏడాది కంటే ఈ సారి 3.3 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. రోజురోజుకూ ఉష్ణోగ్ర పెరుగుతుండటంతో ప్రజలు బెంబేలు చెందుతున్నారు. మధ్యాహ్నం వేడి పెరగడంతో పాటు రాత్రి ఉక్కపోత కూడా ఎక్కువగా ఉండడంతో ప్రజలు అప్పుడే కూలర్లు, ఏసీల వాడకాన్ని మొదలు పెట్టారు.

**గత ఏడాది ఫిబ్రవరి, ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు**

| | మేడ్చల్ జిల్లా | | రంగారెడ్డి జిల్లా | | వికారాబాద్ జిల్లా | |
|---|---|---|---|---|---|---|
| తేది | 2023 | 2024 | 2023 | 2024 | 2023 | 2024 |
| 01 | 32.6 | 31.9 | 32.5 | 32.5 | 34.3 | 32.9 |
| 02 | 32.6 | 34.0 | 31.7 | 32.6 | 33.0 | 32.3 |
| 03 | 32.7 | 32.5 | 30.4 | 35.6 | 34.5 | 34.2 |
| 04 | 31.8 | 32.9 | 32.2 | 33.8 | 30.4 | 33.8 |
| 05 | 33.5 | 33.7 | 33.4 | 35.7 | 34.9 | 34.3 |
| 06 | 32.8 | 35.2 | 32.9 | 33.2 | 34.4 | 35.0 |
| 07 | 34.6 | 38.3 | 34.3 | 38.4 | 34.4 | 38.2 |
| 08 | 35.1 | 38.4 | 33.9 | 38.5 | 33.6 | 38.6 |
| 09 | 36.4 | 37.3 | 35.1 | 37.4 | 36.9 | 37.1 |



### ఎండలో తిరగలేక పోతున్నా



రోజూ ఊరూవాడ తిరిగి పాత సామాన్లు కొంటుంటాం. ఉదయం 8 దాటితే చాలు ఎండ దంచి కొడుతుంది. మధ్యాహ్నం ఎండకు వ్యాపారం చేసుకోలేక పోతున్నా. తిరిగి సాయంత్రం గ్రామాల్లో పర్యటిస్తున్నాను.

**సారంగి వీరస్వామి, స్క్రాప్ వ్యాపారి, హిమయత్‌నగర్**

### ఎండ తీవ్రత పెరిగింది



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలకు గిరాకి తగ్గింది. ఎండలు ముదిరాయి. మధ్యాహ్న సమయంలో ఆటో తోలాలంటే ఇబ్బందిగా మారింది. ఎండలు ఎప్పుడే ఇలా ఉంటే.. మున్ముందు ఎలా ఉంటుందోనని భయమేస్తోంది.

**బీసా మహేందర్, ఆటో డ్రైవర్, మొయినాబాద్**

### ఉక్కపోత పెరిగింది



పదేళ్లుగా కొందుర్గు మండల కేంద్రంలో లస్సీ అమ్ముతున్నా. వ్యాపారం బాగానే సాగుతుంది. కానీ.. ఈ సారి ఫిబ్రవరిలోనే ఎండ దంచి కొడుతుంది. మార్చి, ఏప్రిల్‌లో ఎండలను తలచుకుంటేనే భయమేస్తుంది. ప్రస్తుతం ఎండతో పాటు ఉక్కపోత కూడా పెరుగుతుంది.

**నర్సింహులు, లస్సీ బండి వ్యాపారి, కొందుర్గు**

## బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా..

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



కొడంగల్, ఫిబ్రవరి 9: తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. తన సోదరుడు మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విషయం విదితమే. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యేతో ప్రస్తావించగా తాను బీఆర్ఎస్‌ను వీడేది లేదని, పార్టీలోనే కొనసాగుతానని తెలిపారు. రాజకీయాల్లో ఎవరి ఇష్టాలు వారివేనని, వారికి చేవేళ్ల లోక్‌సభకు పోటీ చేసేందుకు హామీ ఇచ్చినట్లు ఉన్నారని, అందుకే సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఉండొచ్చని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుదామని తనతో చర్చించగా తిరస్కరించడం జరిగిందన్నారు.



సర్వే నిర్వహిస్తున్న నేవీ, రెవెన్యూ అధికారులు

## నేవీరాడార్ ప్రాజెక్టు సర్వే ప్రారంభం

- దామగుండం రిజర్వు ఫారెస్ట్‌లో హద్దులు పరిశీలించిన నేవీ, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు
- వారం రోజులపాటు కొనసాగనున్న సర్వే

పూడూరు, ఫిబ్రవరి 9 : వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం, పూడూరు మండలంలో దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో నేవీరాడార్ ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే ప్రారంభమైంది. రెండు రోజులుగా నేవీ, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు ప్రభుత్వం, నేవీ నిర్ణయించిన భూభాగానికి హద్దులను పరిశీలించారు. అయితే పురాతన దేవాలయమైన రామలింగేశ్వరానికి సంబంధించిన 30ఎకరాల భూమి హద్దు భాగాలను నేవీ నుంచి వేరు చేసి తమకు సంబంధించిన భూభాగానికి సర్వే చేసి కంచె వేయడానికి సిద్ధమయ్యారు. శుక్రవారం రెవెన్యూ అధికారులు, అటవీ శాఖ అధికారులు, నేవీ అధికారులు దామగుండం రామలింగేశ్వరస్వామి ఆలయ భూమికి సర్వే నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఇటు నేవీ అధికారులు తమ సర్వేను వేగవంతం చేశారు. ఈ సర్వే మరో వారం రోజులు పట్టొచ్చని సంబంధిత అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నేవీ కెప్టెన్ వెంకట్‌దాస్, రెవెన్యూ సర్వేయర్ సుధాకర్, అటవీ శాఖ బీట్ ఆఫీసర్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్ల సమస్యను పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

వికారాబాద్, ఫిబ్రవరి 9 : ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారికి కనీస వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస చంద్రయ్య అన్నారు. శుక్రవారం వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పెండింగ్ పీఆర్సీని వెంటనే చెల్లించాలని, ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. ఆశాలకు ప్రసూతి సెలవుల ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణ, మాధవ, మంగమ్మ, ఉమాదేవి, అరుణ, సుజాత, రాజ్యలక్ష్మి, నర్సమ్మ, పద్మ, మున్నిబాయ్, సత్తిబాయి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో

# సామాన్య భక్తులకు పెద్దపీట

- కీసరగుట్ట మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందీ కలగకూడదు
- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

కీసర, ఫిబ్రవరి 9: వచ్చే నెల 6 నుంచి 11వ తేదీ వరకు కీసరగుట్టలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని, ఎలాంటి ఇబ్బంది కలగకూడదని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బ్రహ్మోత్సవాలపై శుక్రవారం కలెక్టరేట్‌లో డీసీపీ పద్మజాతో కలిసి కలెక్టర్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. అదే విధంగా శీఘ్రదర్శనం, అభిషేకం టిక్కెట్లు ఆలయం ప్రాంగణం వద్దనే కాకుండా ఆన్‌లైన్లో కూడా విక్రయించాలన్నారు. క్షేత్రం ఇరువైపుల, భక్తులు తిరిగే ప్రాంతాలల్లో కూడా పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు బారికెడ్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు తెలియజేశారు. నిరాంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. భక్తులకు సరిపడా బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని సమీకృత కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, ఆర్‌డీవో రాజేష్, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఫౌండర్ సభ్యులు, ఈవో నరేందర్, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పార్లమెంట్ ఎన్నికలు

మేడ్చల్ కలెక్టరేట్‌లో ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను పరిశీలించిన ఎన్నికల కమిషన్ అధికారులు, కలెక్టర్ గౌతమ్



ఈవీఎంలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు నవీన్ దుద్ది

కీసర, ఫిబ్రవరి 9: పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడు వచ్చిన పకడ్బందీగా నిర్వహించాలని జాతీయ ఎన్నికల పరిశీలకుడు నవీన్ దుద్ది, రాష్ట్ర అదనపు ఎలక్ట్రోరల్ అధికారి లోకేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను మేడ్చల్ కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా నవీన్‌దుద్ది, లోకేష్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలువిజయవంగా నిర్వహించేందుకు తగిన ప్రణాళిక రూపొందించాలని, ఆయాశాఖల అధికారులను సమన్వయం చేసుకోవాలని అధికారులు తెలియజేశారు. పరిశీలనలో భాగంగా ఈవీఎంలను, వీవీ ప్యాట్, బ్యాలెట్ బాక్సులు పనితీరును ఈసీఎల్ కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు అధికారులను కలిశారు. కార్యక్రమంలో డీఆర్‌వో హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

### ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్ల పరిశీలన



ఈవీఎం గిడ్డంగిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్ల మొదటి స్థాయి పరిశీలనను ఎన్నికల కమిషన్ అదనపు కార్యదర్శి, ఎఫ్ఎల్‌సీ పరిశీలకులు మల్లారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఈవీఎం గిడ్డంగిలో భద్రపరిచిన, ఈవీఎం, వీవీప్యాట్ మొదటి విడత పరిశీలన ప్రక్రియలో చేపడుతున్న వివరాలను సాంకేతిక నిపుణులను అదనపు కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఎల్‌సీ లో ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# హస్తం వైపు పట్నం అడుగులు.. తప్పనిసరి పరిస్థితులేనా!

- నాడు మేనమామ ఇంద్రారెడ్డి వెంట కాంగ్రెస్‌లో చేరని మహేందర్‌రెడ్డి
- ఆ పార్టీ అధికారంలో ఉన్నా విపక్ష ఎమ్మెల్యేగా కొనసాగింపు
- చివరికి కాంగ్రెస్ వైపు అడుగులు



తాండూరు, ఫిబ్రవరి 9: 30 ఏళ్ల పాటు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసి 1994లో తాండూరు కాంగ్రెస్ కంచుకోటను బద్దలు కొట్టి ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి రాజకీయంగా తప్పని సరి పరిస్థితుల్లో కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. 1992లో మేనమామ మాజీ మంత్రి ఇంద్రారెడ్డి ప్రోత్సాహంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తెలుగుయువత అధ్యక్షుడిగా రాజకీయాల్లోకి వచ్చిన మహేందర్‌రెడ్డి 1994లో టీడీపీ తరఫున తాండూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 1995లో రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ సంక్షోభంతో మేనమమ ఇంద్రారెడ్డి , మహేందర్‌రెడ్డి టీడీపీ లక్ష్మీపార్వతి వర్గంలోకి వెళ్లారు. టీడీపీ(ఎల్‌పీ) నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. తర్వాత మహేందర్‌రెడ్డి టీడీపీ (చంద్రబాబు) వర్గంలో చేరారు. 1999, 2009లో తెలుగుదేశం పార్టీ నుంచి తాండూరు ఎమ్మెల్యేగా మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. 2014లో టీఆర్ఎస్(ప్రస్తుతం బీఆర్ఎస్)లో చేరి తాండూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. 2018లో తిరిగి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి చేతిలో ఓటమి చెందారు. రోహిత్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో ఇద్దరి మధ్య గ్రూపు తగాదాలు పెరిగాయి. 2019, 2022లో మహేందర్‌రెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగారు. 2023లో మహేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వకుండా మంత్రి పదవి కట్టబెట్టి పార్టీని వీడకుండా చెక్ పెట్టారు. ఇదిలా ఉంటే మహేందర్‌రెడ్డి సతీమణి 2006, 2014లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, 2019లో వికారాబాద్ జిల్లా జడ్పీచైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో సునీతారెడ్డి, మహేందర్‌రెడ్డి ఇద్దరు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్నారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కలిశారు.

### వారితో కలిసొచ్చేదెవరో!

ఇప్పటికే మహేందర్‌రెడ్డి వర్గానికి చెందిన తాండూరు, బషీరాబాద్, ఎంపీపీలు అనితాగౌడ్ , కరుణ, డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, సొసైటీ చైర్మన్లు సురేందర్‌రెడ్డి, అజయ్ ప్రసాద్ , కౌన్సిలర్లు నీరాజబాల్‌రెడ్డి, రత్నమాల, తదితరులు అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. మహేందర్‌రెడ్డి వెంట కాంగ్రెస్‌లో చేరేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మాజీ ఎంపీపీ కరుణం పురుషోత్తంరావు సిద్ధమయ్యారు. తాండూరు, యలాల, జడ్పీటీసీలు మంజుల, సంధ్య, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ , పశుసంవర్ధక శాఖ మాజీ చైర్మన్ గాజీపూర్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ స్వరూపా చేరుతారా.. లేదా అన్నది సందేహాలు వ్యక్తం కావడంతో మహేందర్‌రెడ్డి వర్గం ప్రయత్నాలు మొదలు పెట్టింది. స్థానికంగా అనుచరులను సంప్రదించకుండా నిర్ణయం తీసుకోవడంపై ఆయన వర్గంలో కొందరు పెదవి విరుస్తున్నారు. నాడు బీఆర్ఎస్‌లో చేరిన సమయంలో ఇక్కడి నేతలను సంప్రదించకుండా పార్టీ మారినా తర్వాత మహేందర్‌రెడ్డి వెంట నడిచారు.

# ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న యూనివర్సిటీ అధికారి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 9: వృత్తిపరమైన నైపుణ్యం గల ఉత్తమ విద్యార్థులుగా తీర్చి దిద్దడమే మల్లారెడ్డి యూనివర్సిటీ లక్ష్యమని యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ వీకేఎస్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ ఎంఆర్‌యూ సెట్‌లో విద్యార్థులకు శుక్రవారం మెరిట్ అండ్ స్కాలర్‌షిప్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్‌ఛాన్స్‌లర్ వీకేఎస్ రెడ్డి మాట్లాడారు. నైపుణ్యంగల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్న ఉద్దేశ్యంతో తమ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అడ్మిషన్ అండ్ స్కాలర్‌షిప్‌ల ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులు చదువుకోవడానికి ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే వీలు కల్పించామన్నారు. మెరిట్ ఉన్నప్పటికీ చాలా మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు నోచుకుని దయనీయ స్థితిలో ఉన్నారని, వారికిది ఒక మంచి అవకాశమన్నారు. ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు అన్ని వసతులు సమకూర్చి విశ్వవిద్యాలయంలో విద్యాబుద్ధులు నేర్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అడ్మిషన్ స్కాలర్‌షిప్ పోస్టర్లను ఆవిష్కరించారు.

# సీఆర్‌పీల డైరీ ఆవిష్కరణ



సీఆర్‌పీల డైరీని ఆవిష్కరిస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 9: కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి కె.వెంకట్‌రెడ్డిని సమగ్రశిక్షా ఉద్యోగులు కలిశారు. కొడంగల్‌లో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వారు ప్రత్యేకాధికారి చేతుల మీదుగా సీఆర్‌పీల డైరీని ఆవిష్కరించారు. సమానపనికి సమాన వేతనాలు, రెగ్యులరైజేషన్ లాంటి సమస్యలను వివరించారు. ఇందుకు స్పందించిన ఆయన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీల రాష్ట్ర అధ్యక్షుడు గంగుల కృష్ణారెడ్డి, కొడంగల్ సమగ్ర శిక్ష ఉద్యోగులు రాఘవేందర్, శ్రీనివాస్, శంకరయ్య, జమీరుద్దీన్, తిరుమలేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నర్సింగ్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఫిబ్రవరి 9 : తాండూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయడానికి వివిధ కేటగిరీల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ 2 పోస్టులు ఉన్నాయని పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా అండ్ కంప్యూటర్ అప్లికేషన్, బ్యాచిలర్ ఇన్ కంప్యూటర్‌సైన్స్ విద్యార్హత కలిగి ఉండాలని, రికార్డ్ అసిస్టెంట్ 2, హౌస్‌కీపింగ్ 4 పోస్టులకు డిగ్రీ అర్హత, అసిస్టెంట్ లైబ్రరీ 1 పోస్టుకు డిగ్రీ కానీ డిప్లమా ఇన్ లైబ్రరీ సైన్స్ చదివి ఉండాలన్నారు. ఆఫీస్ సబార్డినేట్ 6, ల్యాబ్ అటెండెంట్ 5, లైబ్రెరి అటెండెంట్ 3 పోస్టులకు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని ఆమె తెలిపారు. హెవీ వెహికల్ డ్రైవర్ పోస్టుకు పదవ తరగతి చదివి హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలని 1 డ్రైవర్ పోస్టుకు పదవ తరగతి ఉత్తీర్ణతతో పాటు ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. ఐటీఐ ఎలక్ట్రానిక్స్, డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్స్ ఉత్తీర్ణులైన వారికి 1 పోస్ట్ ఉన్నందున అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాల నుంచి 43 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 12 నుంచి 17 వరకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల తాండూర్ నందు సమర్పించాల్సిందిగా తెలిపారు. వివరాల కోసం 9948176126ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ చెప్పారు.

## పారదర్శకంగా క్షేత్రస్థాయి పరిశీలన

● జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వికారాబాద్, ఫిబ్రవరి 9 : మహాలక్ష్మి పథకం కోసం ప్రజలు సమర్పించిన దరఖాస్తులలో తప్పిదాలను సవరించేందుకు నియమించిన బృందాలన్నీ క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పనులను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 25వ వార్డు, నారాయణపూర్ గ్రామ పంచాయతీలో ఆయన పర్యటించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. తప్పులు దొర్లకుండా ఈ నెల 10 వరకు పూర్తి చేయాలన్నారు. దరఖాస్తులో గ్యాస్‌ఏజెన్సీ పేరు, కన్జూమర్ నెంబర్, రేషన్ కార్డు నెంబర్ తదితర వివరాలను సరిగా నమోదు చేయాలని చెప్పారు. ఎంపీడీఓలు, తహశీల్దార్లు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారుల నేతృత్వంలో ప్రత్యేక టీమ్‌లు పనిచేస్తున్నాయని తెలిపారు. తప్పులు దొర్లకుండా రికార్డులను ఇంటింటికి వెళ్లి పరిశీలించి ఆన్‌లైన్ చేయాలన్నారు. ఎంపీడీవో సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, మున్సిపల్ టిపిఓ శ్రీధర్ పాల్గొన్నారు.

## భూములు తీసుకోవద్దని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

కొడంగల్, ఫిబ్రవరి 9 : అభివృద్ధిలో భాగంగా కొడంగల్‌లో మెడికల్, నర్సింగ్ కాలేజీలు, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణలో తమ భూములు తీసుకోవద్దని పలువురు రైతులు కోరారు. మండలంలోని అప్పాయిపల్లిలో గల సర్వే నెం.19 అసైన్డ్ రైతులు శుక్రవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతి పత్రం అందించారు. సర్వే నెం.19లో 74 ఎకరాల భూమి ఉందని, 47 కుటుంబాలు ఆ భూమిపై ఆధారపడి జీవిస్తున్నాయని వారు కలెక్టర్‌కు వివరించారు. అభివృద్ధి పనుల కోసం అధికారులు ఆ భూమిలో సర్వే నిర్వహించడంతో రైతులు భయాందోళన చెందుతున్నారని చెప్పారు. రైతు కూలీ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూర్ చంద్రయ్య, రైతులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, పకీరప్ప, మోతిబాయి, నర్సమ్మ, రుక్మిణిబాయి, సచిన్, రాములు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశించినా నో రీటెండర్

● ఏళ్ల తరబడి అద్దె నెలకు రూ.500 మాత్రమే

● పట్టించకోని అధికారులు

శంకర్‌పల్లి ఫిబ్రవరి 9 : మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం రీటెండర్ నిర్వహించి అన్ని వర్గాల వారికి దుకాణ సముదాయాలు కేటాయించాలని నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు నాయకులు వాటిని తుంగలో తొక్కారు. శంకర్‌పల్లి గ్రామ పంచాయితీగా ఉన్నప్పటి నుంచి 25 సంవత్సరాలుగా గతంలో ఉన్న వ్యాపారస్తులే దుకాణ సముదాయాల్లో కొనసాగుతున్నారు. మున్సిపాలిటీగా ఏర్పడ్డాక కూడా ఆదాయానికి 5 ఏళ్లుగా భారీగా గండి పడుతున్నా ఏ ఒక్క అధికారి, నాయకుడూ స్పందించడం లేదని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 15 ఏళ్లుగా 500రూ.లే అద్దె , కలెక్టర్ ఆదేశాలు బేఖాతారు, కథనాలకు జిల్లా కలెక్టర్ స్పందించి ముగ్గురు కమిషనర్‌లను దర్యాప్తు కొరకు శంకర్‌పల్లి మున్సిపాలిటీకి పంపించగా వారు వచ్చి దర్యాప్తు చేపట్టారు. వారి నివేదిక మేరకు రీటెండర్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కానీ స్థానిక నాయకులు అధికారులపై వత్తిడి తెచ్చి రీటెండర్ నిర్వహించకుండా చేశారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 238 షటర్‌లకు ఒక్కో షటర్‌కు రూ. 500 నుంచి 1000రూ మాత్రమే మున్సిపాలిటీ వారు వసూలు చేస్తున్నారు. పట్టణంలోని ఆర్టీసీ షటర్‌లకు 25 వేల నుంచి 30 వేల వరకు షాపుల నిర్వాహకులు అద్దె చెల్లిస్తున్నారు. కానీ మున్సిపాలిటీ దుకాణ సముదాయాలకు ఇంత తక్కువ అద్దె చెల్లిస్తున్నా రాజకీయ ప్రయోజనాల కోసం ఏ ఒక్కరూ స్పందించడం లేదు. పలు సర్వసభ్య సమావేశాలలో వైస్ ఛైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు సమావేశంలో రీటెండర్‌లు నిర్వహించాలని ప్రశ్నించినా సంబంధిత అధికారలెవరు స్పందించకపోగా, నెలకు రూ.కోటికి పైగా ఆదాయం రావాల్సి ఉండగా సూమారు రూ.15 లక్షలు మాత్రమే వస్తుండడంతో పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం రీటెండర్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ, మండల ప్రజలు కోరుతున్నారు.

### రీటెండర్ నిర్వహించకుండా నిర్లక్ష్యం



ఏళ్ల తరబడి రీటెండర్‌లు నిర్వహించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడుతున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం. సర్వసభ సమావేశంలో విన్నవించినా పట్టించకోవడం లేదు. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం అన్ని వర్గాల వారికి కేటాయించేలా అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నా.

- రాములు, 8 వవార్డు కౌన్సిలర్




మున్సిపల్ దుకాణ సముదాయం

### ఉన్నతాధికారులు ఆదేశిస్తే రీటెండర్



మున్సిపాలిటీ ఆదాయం కోల్పోవడం వాస్తవమే. ఉన్నతాధికారులు ఆదేశాలిస్తే రీటెండర్ నిర్వహిస్తాం. ఇటీవల ఉన్నతాధికారులు దర్యాప్తుకు వచ్చారు. దుకాణసముదాయాలపై వారికి నివేదిక ఇచ్చాం.

- మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్

# చనిపోయిన కూలీల పేరిట ఉపాధి డబ్బులు స్వాహా

● సామాజిక తనిఖీలో బయటపడిన అక్రమాలు

● రూ.10 కోట్లకుపైగా నిధులపై దర్యాప్తు

కొడంగల్, ఫిబ్రవరి 9: ఉపాధి హామీ పనులపై మండలంలో జరుగుతున్న 13వ సామాజిక తనిఖీల్లో పలు అక్రమాలు వెలుగు చూశాయి. చనిపోయిన కూలీల పేరిట చిన్ననందిగామలో పలువురు ఉపాధి హామీ డబ్బులు స్వాహా చేశారని అధికారులు గుర్తించారు. సామాజిక తనిఖీ కొనసాగుతుండటంతో పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ఈ విషయంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రధానంగా మండలంలోని చిన్ననందిగామ తదితర గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో పలు అవినీతి అక్రమాలు వెలుగు చూసినట్లు అధికారులు వెల్లడించారు. కూలీల హాజరు నమోదు చేయకపోవడం, సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంపై ఉపాధిహామీ ఏపీడీ సరళ ఉపాధిహామీ క్షేత్రసాయి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 13వ విడత సామాజిక తనిఖీలో కొడంగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన పనులు, ఖర్చు చేసిన నిధులపై డీఆర్ఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు చదివి వినిపించారు. చిన్ననందిగామలో క్రీడా ప్రాంగణం, ఇతర పనుల్లో అవకతవకలు జరిగాయంటూ గ్రామస్థులు దత్తు తదితరులు అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. కూలీలకు సకాలంలో డబ్బులు అందించడంలో జరిగిన నిర్లక్ష్యంపై సంబంధిత అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో వారం రోజుల పాటు సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసింది. 13వ విడత సామాజిక తనిఖీ ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన పనులకు .రూ.10,0385899 ఖర్చు చేశారు. పర్సాపూర్, అప్పాయిపల్లి, హస్నాబాద్, అంగడిరైచూర్, రుద్రారం తదితర గ్రామాల్లో సైతం కూలీలకు సకాలంలో డబ్బులు అందించలేదని కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో కూలీలకు పనులు కల్పించే దిశగా కూలీ డబ్బులు అందించేందుకు ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీలో అవినీతికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని అన్నారు. ఎంపీడీవో పాండు, ఉపాధిహామీ అధికారులు భార్గవి, ఏపీవో రాములు, డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీలో ఫిర్యాదులు అందిస్తున్న కూలీలు

## సంపన్నుల్లో చేతుల్లో వనరుల బందీ

● టీడీపీ నేత బక్కని నర్సింహులు



షాద్‌నగర్, ఫిబ్రవరి 9 : భూములు, జలవనరులు సంపన్నుల చేతుల్లో బందీ అవుతున్నాయని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మానవమనుగడకు, జీవ రాశులు ఉనికికి భూమి అవసరమని చెప్పారు. భూములన్నీ సంపన్నుల చేతుల్లో ఉంటే మానవమనుగడ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం, ట్రస్టులు, ఆశ్రమాల పేరట భూముల కొనుగోలు, ఫాంహౌస్‌ల నిర్మాణం వల్ల లక్షలాది ఎకరాలు కొంతమంది చేతుల్లోకి వెళుతోందన్నారు. ఇదిలాగే కొనసాగితే భవిష్యత్తులో కొంతమంది వ్యక్తులు సమాజాన్ని ప్రభావితం చేసే అవకాశముందన్నారు. గతంలో సీలింగ్ యాక్ట్ కింద సేకరించిన భూములు ఏమయ్యాయని ప్రశ్నించారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కాస్తు కాలాన్ని రద్దు చేశారని విమర్శించారు. అడవులు, చెట్లు, జలవనరులు విధ్వంసం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ కోసం నిస్వార్థంగా పనిచేశా

● పార్టీని మోసం చేసినట్టు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం

● టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 9 : గత శాసనసభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ కోసం నిస్వార్థంగా పనిచేసి పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఇతర పార్టీలకు మద్దతుగా పనిచేసినట్లు ఆధారాలు ఉంటే నిరుపించాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి గత నెల 23న షోకాజ్ నోటిసు ఇస్తే వారికి సమాధానం కూడా ఇచ్చానని, దానితో పార్టీ పూర్తిగా సంతృప్తి చెందిదని అన్నారు. తాను 1998లో ఇంద్రారెడ్డితో కలిసి గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. 2000, 2006, 2019లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీగా కాంగ్రెస్ పార్టీ బీఫాం మీద పోటీ చేసినట్లు తెలిపారు. 2018 శాసనసభ ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తం తిరిగి పార్టీ అభ్యర్థి గెలుపుకోసం ప్రచారం చేశానని, 2023 ఎన్నికల్లో షాబాద్ మండలానికే పరిమితం చేశారని అన్నారు. కొంత కాలంగా సోషల్ మీడియా వేదికగా తనపై కొంత మంది తప్పుడు ప్రచారం చేశారన్నారు. పార్టీని మోసం చేయాలనుకుంటే ఎన్నికలకు 15 రోజుల ముందు మద్దూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సోలిపేట్, హైతాబాద్ మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, ఖాజమియా, శంకర్‌పల్లి మండలం పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, మల్కపూర్ అడ్వకేట్ యాదిరెడ్డిలను పార్టీలోకి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎందుకు తీసుకువస్తానని ప్రశ్నించారు. తనపై తప్పడు ప్రచారం చేసే వారు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. తనకు నామినేటెడ్ పదవి రాకుండా అడ్డుకోవడానికే ఇలాంటి చౌకబారు ప్రచారాలకు తెరలేపారని అన్నారు. తాను పని చేయకపోతే షాబాద్ మండలంలో పార్టీకి 1890 ఓట్లు, తన స్వగ్రామంలో పార్టీకి ఏవిధంగా లీడ్ వస్తుందని ప్రశ్నించారు. పార్టీ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, ఆంజనేయులు, నాయకులు చేవెళ్ల స్వామి, రాజశేఖర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, మాణిక్యం, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, కిషోర్‌నాయక్, క్రిష్టారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

## అనురాగ్ యూనివర్సిటీలో డేటాసైన్స్ హ్యాకథాన్




అనురాగ్ యూనివర్సిటీలో జరిగిన డేటాసైన్స్ హ్యాకథాన్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 9 : విద్యార్థులు హ్యాకథాన్‌లలో పాల్గొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా చెప్పారు. అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం డేటా సైన్స్ ఆధ్వర్యంలో 24 గంటల హ్యాకథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది విద్యార్థులను విభిన్న విద్యానేపథ్యాల నుంచి నుంచి 78 బృందాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఊట్ల, డైరెక్టర్ అనురాగ్ పల్లా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'అనురాగ్' గుర్తింపు రద్దు చేయాలి

● ఏబీవీపీ

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 9 : విద్యార్థులను ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని, యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలని శుక్రవారం ఉదయం ఆ యూనివర్సిటీ ముందు ఏబీవీపీ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ సీఎస్‌సీ విద్యార్థి జ్ఞానేశ్వర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి డీన్ పీఎస్ రావు, పీటీలు కారణమని, వారిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో డీన్లు, అధ్యాపకులు విద్యార్థులను అవమానపరుస్తూ ఆత్మహత్యలకు పాల్పడే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. వారి కారణంగానే ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డట్లు బాధితుడు చెప్పినా వాళ్ళపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అనురాగ్ యూనివర్సిటీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీన్, పీటీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులను పంపించారు. విద్యార్థులు ఆందోళనతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏబీవీపీ నాయకులు మహేష్, కార్తీక్, కళ్యాన్, సచిన్, అనిల్, మిథున్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

## 24 గంటల్లోనే వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటేషన్ల రద్దు నిర్ణయం వెనక్కి

తాండూరు, ఫిబ్రవరి 9 : వైద్య ఆరోగ్య శాఖలో డిప్యూటేషన్ల రద్దు నిర్ణయాన్ని హోల్డ్‌లో పెట్టారు. జిల్లా అంతర్గత డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని ప్రభుత్వం గురువారం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సంబంధిత ఉద్యోగులు వారి ప్రాంతాలకు వెళ్ళి జాయినింగ్ కావాలని ఆదేశాలు జారీచేయడంతో వెంటనే జాయిన్ అయ్యారు. డిప్యూటేషన్లు రద్దు చేస్తే చాలా చోట్ల ఆరోగ్య కేంద్రాలకు తాళాలు వేసుకునే పరిస్థితి వస్తుందని భావించి జిల్లాలో అంతర్గత డిప్యూటేషన్లను ప్రస్తుతానికి హోల్డ్‌లో పెట్టాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. ఎక్కడ డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారో అక్కడే విధులు నిర్వహించాలని డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వారికి ఓరల్ ఆదేశాలను ఫోన్‌లో సమాచారం అందించారు. అంతర్గత డిప్యూటేషన్ విషయంలో అవసరమైన వారిని మినహాయించాలని స్పష్టత వచ్చింది. తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో 5గరు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ల్యాబ్ టెక్నిషియన్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. వీరు వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్నారు.

# సీఎంఆర్ బియ్యాన్ని వెంటనే డెలివరీ చేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్


వికారాబాద్, ఫిబ్రవరి 9 : 2022-23 ఖరీఫ్, రబీ కాలం మిగులు సిఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సిఐకి వెంటనే ఈనెల 29 వరకు డెలివరీ చేయాలని జిల్లా ఆదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిల్లర్లు సంబంధిత అధికారులతో సిఎంఆర్‌రైస్ డెలివరీ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే బియ్యాన్ని ఎఫ్‌సిఐకి అందజేయాలని అన్నారు. మిల్లర్లు ఎవరైనా రీసైక్లింగ్ పాల్పడినట్లయితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారులు తమ పరిధిలోని మిల్లర్లను సంప్రదించి వారి సామర్థ్యం ప్రకారం సీఎంఆర్ డెలివరీ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మిల్లులలో ప్రస్తుతం నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ కొండల్ రావు, డిప్యూటీ తహసీల్దారులు, రైస్‌మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలేశ్వర గుప్తా, శ్రీధర్‌రెడ్డి, మిల్లుల యజమానులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

## మార్చి 23, 24న ఎంఆర్‌యూ సెట్

● మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ : వీసీ




వీఎస్‌కే రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి యూనివర్సిటీలో అడ్మిషన్ల కోరుకునే అభ్యర్థులకు మార్చి 23, 24తేదీల్లో ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి తెలిపారు. వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు యువతకు విలువ ఆధారిత ఉన్నతవిద్యను అందించేడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రవేశపరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు మార్చి 22లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఎంఆర్‌యూసెట్‌కు హాజరు కావచ్చని వీసీ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి సూచించారు.

## నేటి నుంచి సాయి ధ్యానమందిరం వార్షికోత్సవాలు

పరిగి, ఫిబ్రవరి 9 : పట్టణంలోని శ్రీశ్రీశ్రీ షిరిడి సాయి ధ్యానమందిరం 20వ వార్షికోత్సవాలు శని, ఆదివారం జరుగనున్నాయి. ఉత్సవాల కోసం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. నేడు సాయిబాబా వారి ఊరేగింపు, ఓంసాయి శ్రీసాయి జయజయసాయి నామ సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని నిర్వహకులు తెలిపారు. రేపు ఉదయం షిరిడి సాయిబాబావారికి కాకడ హారతి, సుప్రభాతం, ఏడు గంటలకు బాబావారికి అభిషేకం, ఉచిత సామూహికసాయి వ్రతాలు జరుగుతాయి. బాబావారికి చందనోత్సవం, సాయి సేవకులచే సత్సంగ ప్రసంగాలు ఉంటాయి. మధ్యాహ్నం 12 గంటలకు బాబాకు హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, బాబావారికి పుష్పాభిషేకం, రాత్రికి శివపార్వతుల కళ్యాణ ఉత్సవం జరుగుతుంది.



సాయి ధ్యాన మందిరం

## వీధులను శుభ్రం చేసిన పంచాయతీ సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ, కార్మికులు

యాచారం, ఫిబ్రవరి 9 : ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యాచారం మండల కేంద్రంలో ఎంపీపీ కొప్పు సుకన్యబాషా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రమదానం చేశారు. పంచాయతీ కార్మికులు, ఉపాధ్యాయులతో కలిసి చెత్తాచెదారం లేకుండ శుభ్రం చేశారు. పలు చోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మండలంలోని వివిధ గ్రామాలలో పంచాయతీ కార్మికులు వీధులను శుభ్రం చేసి చెత్తచెదారాన్ని గ్రామానికి దూరంగా పడేశారు.

## ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం

షాబాద్, ఫిబ్రవరి 9 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎనలేని కృషి చేసిందని పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు సుదర్శన్ అన్నారు. శుక్రవారం షాబాద్‌లో పీఆర్‌టీయూ 53వ ఆవిర్భావదినోత్సం సందర్భంగా షాబాద్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 53 సవంత్సరాలుగా పీఆర్టీయూ పోరాటం చేస్తున్నదన్నారు. గౌరవఅధ్యక్షుడు యాదయ్య, ప్రధానకార్యదర్శి కృష్ణ, నాయకులు నర్సింహులు, డేవిడ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోవిందు, హనుమంతు, ఖాజాపాష, అంజి, ఉన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాలపై దృష్టి సారించాలి



డాక్టరేట్‌ను అందిస్తున్న సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 : విద్యార్థులు తమ పరిశోధనల్లో బాగంగా అన్ని రంగాలపై దృష్టి సారించాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీహెచ్ పురుషోత్తంరెడ్డి, యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్, ప్రత్యేక అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. ఆ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి నెల్లుట్ల మనోజ్ ప్రొఫెసర్ నర్సింహ పర్యవేక్షణలో రసాయనశాస్త్రంలో సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యూయేషన్ ఆఫ్ నావల్ ఫైవ్ మెంబర్డ్ హెటెరో సైక్లిక్ కాంపౌండ్స్ అనే అంశంపై పరిశోధన చేయగా డాక్టరేట్ వరించింది. దీంతో పురుషోత్తంరెడ్డి, సాత్వికరెడ్డిలు ఆయనను శుక్రవారం అభినందించి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యలేనే కాకుండా అన్ని రకాలుగా సామాజిక బాధ్యతవహించి సమాజంలో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. తమ యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రొఫెసర్‌లు దామోదర్, రిజిస్టర్ రవీందర్, కవిత, డీన్ క్రిస్టోఫర్, జగదీష్ అధ్యాపక బృందంతో పాటు పీఆర్వో గాదె రాంబాబు, పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో 'పట్నం' చేరిక శుభసూచకం



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌గౌడ్

తాండూరురూరల్, ఫిబ్రవరి 9: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిలు కాంగ్రె‌స్‌లో చేరడం శుభసూచకమని ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్ అన్నారు. తాండూరు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులతో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని తాండూరు నియోజకవర్గంలో మరింత బలోపేతం చేస్తామన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయనున్న జడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డిని భారీమెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్, నాయకులు ఎస్.పందరి, రవిసింధే, రవీందర్, కేశవరావు, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**అటు కాంగ్రెస్.. ఇటు బీఆర్ఎస్ సంబురాలు**

తాండూరు: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రె‌స్‌లో చేరనుండటంతో తాండూరులోని ఆయన నివాసం వద్ద డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. మరోవైపు బీఆర్ఎస్‌ను వీడి వెళ్లినందుకు పార్టీకి మంచి రోజులు వచ్చాయని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసం వద్ద గురువారం రాత్రి టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.



తాండూరులో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి నివాసం వద్ద టపాసులు కాలుస్తున్న అభిమానులు

# మహేందర్‌రెడ్డికి పార్టీలు మారడం కొత్తేం కాదు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు రాజుగౌడ్, శ్రీనివాసాచారి, సాయిరెడ్డి, వీరేందర్‌రెడ్డి, రాజప్ప

తాండూరురూరల్, ఫిబ్రవరి 9: మాజీ మంత్రి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పార్టీ మారడం కొత్తేంకాదని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మహేందర్ రెడ్డి పార్టీ మారతారనే విషయం ప్రజలకు ముందే తెలుసన్నారు. ఆయన మొదట్లో తెలుగు యువత పార్టీ, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలు మారారని గుర్తుచేశారు. ఆయా పార్టీల్లో కీలకమైన పదవులు అనుభవించి ప్రస్తుతం పదవిలేనందుకు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారని వెల్లడించారు. బీఆర్ఎస్‌లో రెండుసార్లు పనిచేసి, ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న మహేందర్‌రెడ్డి తాండూరుకు చేసిందేమీ లేదన్నారు. అయన సతీమణి, జడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, బీఆర్ఎస్‌లో ఉంటూ వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ ఎమ్మెల్యే అభ్యర్థుల ఓటమికి కృషి చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న వర్గపోరు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి మారే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. వెన్నుపోటు పొడిచి రోహిత్‌రెడ్డి ఓటమికి కారకులైన వారు బీఆర్ఎస్ నుంచి వెళ్తే తమకేం నష్టం లేదని అభిప్రాయపడ్డారు. సంగెంకలాన్ గ్రామానికి చెందిన ఎస్.రవీందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్‌గా ఉంటూ తమ భార్య తాండూరు ఎంపీపీ అనితాగౌడ్ తాండూరు మండలానికి ఎంపీపీగా ప్రాతినిధ్యం వహిస్తూ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ రాజప్ప, బీఆర్ఎస్ నాయకులు వీరేందర్ రెడ్డి, శ్రీనివాసాచారి, వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ సంగీతా ఠాగూర్ తదితరులున్నారు.

## క్రైం కార్నర్

### వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

నవాబుపేట, ఫిబ్రవరి 9: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలు నవాబుపేట, పరిగి మండలాల పరిధిలో చోటుచేసుకున్నాయి. ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మండలంలోని దాదాపూర్ గ్రామానికి చెందిన మాలిశ్ వెంకట్‌రెడ్డి(45) శుక్రవారం పని నిమిత్తం నవాబుపేటకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో అయన బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకట్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భరత్‌భూషణ్ తెలిపారు.

**గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు..**

**పరిగి:** గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. తాండూరుకు చెందిన రజాక్ బైక్‌పై పరిగి నుంచి మన్నెగూడకు వెళుతుండగా నజీరాబాద్ సమీపంలో విద్యుత్‌సబ్‌స్టేషన్ దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రజాక్ తన అత్తగారి గ్రామమైన పూడూరుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

దోమ, ఫిబ్రవరి 9: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని దోర్నాల్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పి.నర్సింహులు(38) శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు నర్సింహులును పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్ఐ రవిగౌడ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

### పేకాడుతున్న 15మంది అరెస్టు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 9: మండలంలోని అన్నారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 15మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం రాత్రి అన్నారం గ్రామ శివారులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా పేకాడుతున్న 15 మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.16,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, కృష్ణ, నరేందర్, శ్రీకాంత్ ఉన్నారు.

**యాలాలలో నలుగురు..**

**యాలాల:** పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు యాలాల ఎస్ఐ శంకర్ తెలిపారు. లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా సమీపంలో శుక్రవారం పేకాడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈమేరకు అక్కడికి వెళ్లి నలుగురు వ్యక్తులు పేకాడుతుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14,100 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

### తాండూరు సెగ్మెంట్‌లో పెరిగిన ఓటర్లు

తాండూరు, ఫిబ్రవరి 9: తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరిగింది.తాజాగా విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలో 2,43,905 మంది ఓటర్లున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల ముందు 2,36,076 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 2,43,905 మంది ఓటర్లుగా నమోదయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికల ముందు తుది ఓటర్ల జాబితాకు 7829మంది ఓటర్లు పెరిగారు. ప్రస్తుతం తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషులు 1,18,228 మంది, మహిళలు 1,25,614మంది ఇతరులు ఏడుగురు, ఎన్ఆర్ఐ ఏడుగురు సర్వీసు ఓటర్లు 49మంది ఉన్నారని అధికారులు వెల్లడించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఈ ఓటరు జాబితానే ఫైనల్‌గా చెప్పవచ్చు. ఏదైనా సందేహాలుంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1950కు కాల్ చెయవచ్చు. లేదా జిల్లా ఎన్నిల అధికారిగా వ్యవహరించే పాలనాధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చు.

### సీఎంను కలిసిన నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డితో కొండల్ రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 9: రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డిని వికారాబాద్ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ననగారి కొండల్ రెడ్డి కలిశారు. సీఎం నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు కొండల్ రెడ్డి తెలిపారు.

**బొంరాస్‌పేట్:** సీఎం రేవంత్‌రెడ్డిని శ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ నాయకులు కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శివరాం చౌహాణ్, శంకర్‌నాయక్, తార్యానాయక్, మండల మాజీ వైస్ ఎంపీపీ దేశ్యానాయక్, సంతోష్‌నాయక్, సుభాష్‌నాయక్ తదితరులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ నెల 15న కొడంగల్ నియోజకవర్గంలో జరిగే సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలకు రావాలని సీఎంను ఆహ్వానించినట్లు వారు తెలిపారు.

### పీవీకి 'భారతరత్న' అభినందనీయం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 9: భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారత రత్న రావడం అభినంద నీయమని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పీవీకి భారతరత్న ఇవ్వడం తెలంగాణకు దక్కిన గౌరవమన్నారు. పీవీ దేశానికి చేసిన సేవలకు గానూ ఈ గౌరవం దక్కిందని కొనియాడారు. వరంగల్ జిల్లా, నర్సంపేట్ మండలం, లక్నాపూర్‌లో జన్మించిన పీవీ ఎంతో కష్టపడి భారత ప్రధాని అయ్యారని, దేశం క్లిష్టపరిస్థితిలో ఉన్నప్పుడు చాణిక్యుడి వలే దేశాన్ని ఆదుకున్నాడని కొనియాడాడు.

### 'గృహజ్యోతి'కి దరఖాస్తుల స్వీకరణ

కులకచర్ల, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకానికి విద్యుత్ సిబ్బంది లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. తెల్లరేషన్, ఆధార్‌కార్డు నెంబర్లు అనుసంధానం చేస్తున్నారు. కులకచర్ల విద్యుత్ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మండల పరిధిలో ఆన్‌లైన్ యంత్రాల ద్వారా రేషన్, ఆధార్‌కార్డులను అప్‌లోడ్‌ను ప్రారంభించారు. లబ్ధిదారులు తమ వివరాలతో జిరాక్స్ కాపీలను కార్యాలయంలో అందించాలని సిబ్బంది తెలిపారు.

### నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 9: మేడ్చల్ మండలం పూడూరు 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు వెల్లడించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నవాబుపేట, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మన్, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో గోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నైట్‌వాచ్‌మన్, హెడ్‌కుక్ పోస్టులకు పదోతరగతి విద్యార్హత, అసిస్టెంట్ కుక్‌కు 7వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన 18సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలు వయసు కలిగిన మహిళలు ఈనెల 13వ తేదీ సాయంత్రం 4గంటలలోపు పాఠశాలలో దరఖాస్తులు అందించాలన్నారు. అదేవిధంగా కేజీబీవీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కావెంజర్, అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంఈవో తెలిపారు. ఆయా పోస్టులకు ఈ నెల 12లోపు సాయంత్రం 4గంటలలోపు కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తులు అందించాలన్నారు.

### జాతీయ అవార్డుకు ఎంపిక

వికారాబాద్, ఫిబ్రవరి 9: సంత్ సేవాలాల్ మహరాజ్ జాతీయ అవార్డుకు వికారాబాద్ మండలం కోటాలగూడ గ్రామానికి చెందిన రాఘవన్ నాయక్ ఎంపికయ్యారు. అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రాఘవన్ నాయక్ అవార్డుకు ఎంపిక కాగా ఫిబ్రవరి 11న తిరుపతిలో అవార్డు ప్రదానం ఉంటుందని, అవార్డు సెలక్షన్ నేషనల్ కమిటీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

### సంఘం విజయాలు ఆదర్శనీయం

వికారాబాద్, ఫిబ్రవరి 9: సంఘం సాధించిన విజయాలు ఆదర్శనీయమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ.చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని పీఆర్‌టీయూ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సంఘం కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. సంఘం నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాబ్యానాయక్, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

**పరిగి:** ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు తాము కృషిచేస్తామని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. శుక్రవారం పరిగిలోని పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. రిటైర్డు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమర్‌నాథ్, శ్రీశైలం, ఎం.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, ఎండీ జహంగీర్, అంజియ్య, రమాపతి, టి.వెంకటయ్య, లాలయ్య, శంకర్, వెంకటేశం, జి.గోపాల్, ఎస్.వెంకటయ్య డి.బుగయ్య పాల్గొన్నారు.

# టాస్క్‌ఫోర్స్ వరుస దాడులు

● బెంబేలెత్తుతున్న దుకాణ యజమానులు

కులకచర్ల, ఫిబ్రవరి 9: కులకచర్లలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వరుస దాడులతో స్థానిక కిరాణ దుకాణాల యజమానులు బెంబేలెత్తుతున్నారు. 15రోజుల కిందట కులకచర్లలోని ఓ కిరాణ దుకాణంలో తనిఖీ చేయగా పెద్దమొత్తంలో అనుమతిలేని అల్లంపేస్టు లభించింది. దుకాణ యజమానిని అదుపులోకి తీసుకున్నారు. పాలమూర్‌లో అల్లం పేస్టు కొనుగోలు చేసిన వ్యాపారులను ఆయన టాస్క్‌ఫోర్స్ అధికారులకు చూపించాడు. వారు పాలమూర్ వ్యాపారిని అదుపులోకి తీసుకొని విచారించగా హైదరాబాద్‌లోని అల్లంపేస్టు గోదాంను చూయించారు. హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున నకిలీ అల్లంపేస్టును స్వాధీనం చేసుకొని సంబంధిత తయారీదారులపై కేసు నమోదు చేశారు. తాజాగా రెండు రోజుల కింద టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కులకచర్లలో రెండు కిరాణ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. వారి వద్ద అనుమతి లేని నకిలీ అల్లంపేస్టు లభించగా యజమానులను అదుపులోకి తీసుకున్నారు. వీరుకూడా పాలమూర్‌లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో విచారణ చేపడుతున్నారు. ఈ విషయం తెలిసిన ఇతర కిరాణ దుకాణాల యజమానులు దుకాణాలను మూసివేశారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కులకచర్లలోని కిరాణ దుకాణాల్లో వరుస దాడులతో యజమానులు బెంబేలెత్తుతున్నారు. దుకాణాల్లో అనుమతి లేని అల్లంపేస్టుతో పాటు ఇతర నకిలీ పదార్థాలు విక్రయిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

# అన్ని రంగాల్లో మున్సిపాలిటీ అభివృద్ధి



వేలంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, మున్సిపల్ అధికారులు, తదితరులు

కీసర రూరల్, ఫిబ్రవరి 9: నాగారం మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ లై బజార్ వేలం నిర్వహించారు. ఈ వేలంలో అత్యధికంగా రూ.43లక్షల 10వేలు కృష్ణారావు అనే వ్యాపారి లైబజార్ వసూలు చేసే హక్కులను పొందాడు. షేక్‌చంద్ అనే వ్యక్తి వేలం పాడి రూ.5.12లక్షలకు మాంసం దుకాణాల నుంచి వ్యర్థాలు సేకరణ హక్కులను పొందాడు. ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు టెండర్ అమలులో ఉంటుందని మున్సిపల్ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ లైబజార్, మాంసం వ్యర్థాల సేకరణ టెండర్ల ద్వారా మున్సిపాలిటీకి సవత్సరానికి రూ.48.22లక్షలు సమకూరనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీకి వివిధ రకాలుగా సమకూరిన ప్రతీ పైసాను అభివృద్ధి పనులకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు, మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల హాస్టల్‌లో వసతులు మెరుగుపర్చాలి

● మల్లారెడ్డి యూనివర్సిటీలో ఏబీవీపీ నిరసన



మల్లారెడ్డి యూనివర్సిటీలో నిరసన చేపడుతున్న ఏబీవీపీ నాయకులు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 9: విద్యార్థులకు పురుగుల భోజనం పెడుతున్న మల్లారెడ్డి యూనివర్సిటీ క్యాంటీన్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా నాయకుడు శ్రీనాథ్ కోరారు. మల్లారెడ్డి యూనివర్సిటీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు పురుగుల భోజనం పెట్టటాన్ని నిరసిస్తూ శుక్రవారం ఎబీవీపీ నాయకులు యూనివర్సిటీలో నిరసన చెపట్టారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థుల నుంచి డబ్బులు దండుకోవటమే ధ్యేయంగా యూనివర్సిటీ యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. మల్లారెడ్డి యూనివర్సిటీలోని అన్ని హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయటంతో పాటు బాలికల హాస్టల్‌లో విధులు నిర్వహించే సిబ్బందిని మార్చి మొత్తం మహిళలను నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించ బోమన్నారు. అనంతరం యాజమాన్యం వారు విద్యార్థి నేతలతో మట్లాడారు. విద్యార్థులకు భోజన వసతులు సమకూర్చే క్యాంటీన్ల నిర్వాహణపై ప్రత్యేక దృష్టిసారిస్తామని, బాలికల హాస్టల్‌లో మహిళా సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు నిరసనను విరమించారు.

# భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు



శామీర్‌పేట శ్రీభవానిరామలింగేశ్వర్ స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

శామీర్‌పేట, ఫిబ్రవరి 9: శ్రీభవానిరామలింగేశ్వర స్వామి ఆలయం(శివాలయం)లో గురువారం రాత్రి మాసశివరాత్రి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీభవానిరామలింగేశ్వర్ స్వామి ఆలయంలో ప్రధానార్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో వేదబ్రహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మంత్రపుష్పం, అర్చన, తీర్థప్రసాద వితరణ చేశారు. శామీర్‌పేటకు చెందిన భజన మండలి బృందం ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

**పెద్దేముల్:** గొట్లపల్లి గేటువద్ద గల శివాలయంలో నేడు(శనివారం)ఉదయం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పూజారి మల్లప్ప తెలిపారు. స్వామివారికి అభిషేకాలు, 11వ తేదీ ఆదివారం రుద్రాభిషేకం, ఆంజనేయస్వామికి చందనోత్సవం, నవగ్రహ పూజ, హోమం, మధ్యాహ్నం 2గంటలకు శివపార్వతుల గంగాస్నానం, 12వ తేదీ ఉదయం స్వామివారికి పల్లకీసేవ, 6గంటలకు అగ్నిగుండం, 11గంటలకు బోనాలు, 12గంటలకు కల్యాణం నిర్వహించనున్నట్లు వివరించారు.

### శిక్షణ తరగతులను వినియోగించుకోవాలి



కార్మికులతో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా డైరెక్టర్ అంజయ్య

పరిగి,ఫిబ్రవరి 9: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ కన్‌స్ట్రక్షన్ అకాడమీ(న్యాక్) ఉమ్మడి జిల్లా డైరెక్టర్ అంజయ్య అన్నారు. శుక్రవారం జన్‌సహస్ సంస్థ, అంకిత పౌండేషన్ ఆధ్వర్యంలో కార్మికులకు పరిగిలో జరుగుతన్న శిక్షణ శిబిరాన్ని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శివవర్ధతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జన్‌సహస్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాష్, ట్రైయినీ ఇన్‌చార్జి ప్రసాద్, ప్రతినిధులు రాజయ్య పాల్గొన్నారు.

### పుస్తకావిష్కరణ

శామీర్‌పేట, ఫిబ్రవరి 9: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళాడిగ్రీ కళాశాలలో నూతన పుస్తకాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ శుక్రవారం ఆవిష్కరించారు. కళాశాలలో బీకాం సీఏ పస్టియర్ పైనాన్సియల్-2 పుస్తకంలో ఒక చాప్టర్‌ను డాక్టర్ శ్రీలత రచించారు. ఈ నూతన పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ ముల్లి పావని యాదవ్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 9 : మున్సిపాలిటీలోని ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని 11వ వార్డు టీచర్స్ కాలనీలో శుక్రవారం రూ.6.50లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేష్, మారుతి, వీరేందర్, బాల్‌నర్సింహ, వినోద్ స్థానికులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

● **ఘట్‌కేసర్:** జయ జయహే తెలంగాణ గేయ రచయిత అందేశ్రీ శుక్రవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో గల పిట్టల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన పిట్టల కృష్ణవేణి సాగుచేస్తున్న వివిధ రకాల పంటలను. ఆకుకూరలను పరిశీలించారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డితోపాటు పలువురు అందేశ్రీని ఘనంగా సత్కరించారు.

● **బొంరాస్‌పేట్:** దుద్యాల గ్రామానికి చెందిన మంగలి బస్వరాజ్, సురేశ్, బోగారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌యాదవ్‌లు ఆలయంలో పూజలు నిర్వహించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన సందర్భంగా కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ జిల్లా అఫ్జల్పూర్‌లో వెలిసిన గత్తర్గీ భాగ్యవతి ఆలయంలో శుక్రవారం 101కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు.

● **పరిగి:** పరిగిలో శుక్రవారం విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్ల పాండురంగాచారి, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు చెన్నయ్యచారిలు సంఘం 2024 క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు జగదీశ్వరచారి, రవిచారి, రమేశ్‌చారి, బ్రహ్మచారి, నవీన్‌చారి, రఘుచారి, రాజేశ్‌చారి పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్:** ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతీఒక్కరు కృషిచేయాలని ఘట్‌కేసర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు అన్నారు. ఘట్‌కేసర్‌లోని అవుటర్ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఐఆర్‌బీ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్ రతన్‌సింగ్, జోసఫ్, ప్రసాద్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

● **పరిగి:** గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాపోల్ పంచాయితీ ప్రత్యేక అధికారి డాక్టర్ రామకృష్ణ అన్నారు. రాపోల్ గ్రామంలో శుక్రవారం వారు పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, కార్యదర్శి శ్రీశైలం పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** మండల కేంద్రంలోని స్వామివివేకానంద పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నర్సిములు, హెచ్ఎం చంద్రకళ, పీఈటీ ఆనంద్ పాల్గొన్నారు.

### గెలుపోటములు సహజం



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఇన్‌స్పెక్టర్ గోవర్ధనగిరి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 9: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధనగిరి అన్నారు. కొండాపూర్‌లో గల సంస్కృతి గ్రూపఆఫ్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన సంకల్ప్ 2కే24 వార్షిక క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి విద్యాసంస్థల చైర్మన్ ఎవీ రమణారెడ్డి, కార్యదర్శి రాజేంద్రకృష్ణ, ప్రోగ్రాం కన్వీనర్ మోహన్, ఎస్ఐ అశోక్, ప్రిన్సిపాళ్లు ఉదయ్ కిరణ్, శిరీష, ప్రొఫెసర్ శివకేశవరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మల్లాడి రమాకంత్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు సైదులు, సరిత విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఆర్యవైశ్య నిత్యన్నదాన ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న కీసరగుట్ట ఆలయ చైర్మన్ నాగలింగం శర్మ

కీసర, ఫిబ్రవరి 9: వచ్చేనెల కీసరగుట్టపై జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆర్యవైశ్య నిత్యన్నదాన సత్రం ఆహ్వాన పత్రినను కీసరగుట్ట ఆలయ చైర్మన్ టి.నాగలింగం శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు, సిబ్బంది, కార్మికులు, అధికారులకు భోజన వసతి కల్పించేందుకు సత్రం సభ్యులు సిద్ధంగా ఉన్నట్లు సత్రం అధ్యక్షుడు బెలిదె రమేష్ గుప్తా వెల్లడించారు. అదేవిధంగా అన్నదాన సమయంలో కావాల్సిన ముడి సరుకులను సరఫరా చేసేందుకు వాహనాలకు అనుమతి ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ సభ్యులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

### గ్రామాభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శైలజారెడ్డి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 9: గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో శైలజారెడ్డి అన్నారు. వెల్‌చల్, మొరంగపల్లి, దుర్గం చెరువు గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రతీఒక్కరు సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పంచాయతీ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్‌రెడ్డి, మాధవి, సిబ్బంది నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### కార్యకర్తలకు అండగా ఉంటాం




చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 9: బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. గోవిందాపూర్ గ్రామానికి చెందిన ఎండీ.జాహుర్ ఇటీవలే మృతి చెందడంతో శుక్రవారం ఆయన గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్‌లో సభ్యత్వం ఉండటంతో రూ.2లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, తిరుపతిరెడ్డి, కుశాల్‌కుమార్ పాల్గొన్నారు.

**వికారాబాద్:** గిరిగేట్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రఘుపతి రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న డగా మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

### ఏబీవీపీ కొడంగల్ పట్టణ నూతన కమిటీ



ఎన్నికైన ఏబీవీపీ కొడంగల్ పట్టణ నూతన కమిటీ సభ్యులు

కొడంగల్, ఫిబ్రవరి 9: ఏబీవీపీ వికారాబాద్ జిల్లా కన్వీనర్ హరీశ్ రావు ఆధ్వర్యంలో కొడంగల్ పట్టణ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్గనైజేషన్ అని, విద్యార్థుల సమస్యల కోసం పోరాడుతూనే ఉంటుందన్నారు. కమిటీ కార్యదర్శులుగా పవన్‌కుమార్, అంజి, నిఖిల్, సంయుక్త కార్యదర్శిగా పవన్, ఖేల్ కన్వీనర్‌గా కేశవులును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మంజునాథరెడ్డి, జగదీశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.